క్లుప్తంగా

నేడు ధ్వజస్తంభం స్థాపన


ఏర్పాటు చేయనున్న ధ్వజస్తంభం

పుంగనూరు: పట్టణంలోని కోనేటి వద్ద వెలసిన శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం 43 అడుగుల ఎత్తుగల ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నారు. శనివారం అర్చకులు ఏర్పాట్లు చేశారు. వేకువజాము నుంచి ఆరుద్ర కుంకుమావళి, అర్చన, నవరత్న పంచలోహ నిక్షేపం పూజలు నిర్వహించనున్నారు. కంచి పరమాచార్యులు అందించిన ధ్వజచక్రానికి పూజలు చేసి ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు అప్పినపల్లి విద్యార్థులు


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదువుతున్న గిరీశ్వర్ అండర్–17, 9వ తరగతి చదువుతున్న యుగంధర్ అండర్–14 విభాగంలో చిత్తూరు జిల్లా బాలుర సాఫ్ట్‌బాల్ జట్టుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం నందకుమార్, పీఈటీ ఉదయ్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గతనెల 30వ తేదీ బంగారుపాళ్యం మండలం రాగిమానుపెంట జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఎంపిక పోటీల్లో మంచి ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో చిత్తూరు జిల్లా జట్టులో ఆడతారని చెప్పారు.

ఎకో టూరిజం అభివృద్ధికి చర్యలు


కుంకీలను పరిశీలిస్తున్న చీఫ్ కన్జర్వేటర్ యశోద

రామకుప్పం: మండలంలోని ననియాల ఎకో టూరిజం అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అనంతపురం ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ యశోదభాయ్ తెలిపారు. శనివారం జిల్లా అటవీ అధికారి భరణితో కలసి ఆమె ఎకో టూరిజంను సందర్శించారు. ఈ సందర్భంగా టూరిజంలో ఎకో పార్కు, జంగిల్ సఫారీ, కుంకీలను పరిశీలించారు. అదేవిధంగా బేస్‌క్యాంపు సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఐక్య ఉపాధ్యాయ సంఘం కార్యవర్గం ఏర్పాటు


సహదేవయ్య


లోకనాథ్

చౌడేపల్లె: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ సంఘం మండల కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర నాయకులు రఘుపతిరెడ్డి, జిల్లా కార్యదర్శి జగన్‌మోహన్‌రెడ్డి శనివారం తెలిపారు. స్థానిక ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఎన్నికలు జరిగాయి. మండల అధ్యక్షుడిగా ఈ.సహదేవయ్య, ప్రధాన కార్యదర్శిగా జి.లోకనాథ్, కోశాధికారిగా డి.రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం చేస్తామన్నారు. తమ ఎన్నికలకు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు గండకి పుస్తకావిష్కరణ

పలమనేరు: ప్రముఖ కవి రామిరెడ్డిగారి మాధవరెడ్డి స్వర్ణతుషారం కలం పేరిట రచించిన గండకి పుస్తకావిష్కరణ కార్యక్రమం కళామందిరంలో నేడు నిర్వహించనున్నట్లు తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి పలువురు రచయితలు వస్తున్నారని, స్థానిక తెలుగుభాషాభిమానులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

కరువు మండలంగా ప్రకటించాలి

బంగారుపాళెం: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించాలని జిల్లా రైతు సంఘం కార్యదర్శి శంకర్ డిమాండ్ చేశారు. ఆయన శనివారం మాట్లాడుతూ, ప్రభుత్వం ఇటీవల జిల్లాలో కరువు మండలాలను ప్రకటించిందన్నారు. జిల్లాలో అతిపెద్ద మండలంగా బంగారుపాళెం ఉందన్నారు. 41 గ్రామ పంచాయతీలు, 180 గ్రామాలు ఉన్నాయన్నారు. మండలంలో చాలా మంది రైతులు వ్యవసాయం, పాడి పరిశ్రమపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారని చెప్పారు. వర్షాలు కురవకపోవడంతో వ్యవసాయం చేయడం ఇబ్బందిగా మారిందన్నారు. ఈ ఏడాది సగటు వర్షపాతం అంతంత మాత్రమేనన్నారు. గత ఏడాది కురిసిన వర్షాలకు చెరువుల్లో నీరు చేరిందన్నారు. ప్రస్తుతం కురిసిన వర్షాలకు మండలంలో వంకలు వాగులు కూడా సాగలేదని గుర్తుచేశారు. రైతుల జీవన ప్రమాణాలు మెరుగుపడిన దాఖలాలు కనిపించడంలేదన్నారు. రైతులు అన్ని విధాలా నష్టపోతున్నారని పేర్కొన్నారు. సాగుకు పెట్టిన ఖర్చు కూడా అందడంలేదని తెలిపారు. అందువల్ల ప్రభుత్వం బంగారుపాళెం మండలాన్ని కరువు మండలంగా ప్రకటించి ఆదుకోవాలని కోరారు.

సమయం లేదు రైతన్నా..!

ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో అంతర పంటలకు ఇదే మంచి అదును. ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, పెసలు, కంది, అనప వంటి పంటలను సాగు చేసి రైతులు అధిక ఆదాయం పొందవచ్చు. 10–12 ఏళ్ల వయస్సు ఉన్న మామిడి తోటలో అంతర పంటల సాగుతో అదనపు ఆదాయం పొందవచ్చని వ్యవసాయ అధికారులు చెప్పారు.

- అంతర పంటల సాగుకు మంచి అదును
- ఉలవ, కంది, పెసర సాగుతో ఆదాయం
- వ్యయం తక్కువ..దిగుబడులు ఎక్కువ


మామిడి తోటలో అంతర పంటగా అరటి

వి.కోట : ఉలవలు, కంది, పెసర, అనప పంటలన్నీ లెగ్యూమ్ జాతికి చెందిన పప్పు ధాన్యపు పంటలు. ఇవి గాలిలో ఉండే నత్రజనిని తీసుకొని నేలలో స్థిరీకరించి భూసారం పెంపునకు దోహదపడతాయి. అంతేకాక పచ్చిరొట్ట ఎరువుగా పంట సాగు చేయడం వలన నేల కోతకు గురికాకుండా అరికట్టే అవకాశాలున్నాయి. దీంతోపాటు పశువుల మేతగానూ ఉపయోగపడుతుంది. ప్రధాన పంటలైన మామిడి, సపోటా వంటి తోటలే కాక అరటి తోటల్లోనూ అంతర పంటలుగా సాగుచేసుకోవచ్చు. దీంతో రైతులకు నీటి ఖర్చు, ఎరువులు, ఇతర ఖర్చులు తగ్గి ఒకే సాగు ఖర్చుతో రెండు, మూడు పంటల ఆదాయాన్ని ఆర్జించవచ్చు.

సాగుకు అనుకూలం

ఉలవలు సాగు చేయడానికి సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్ మొదటి వారం వరకు అనుకూలం. వీటిని బీడు భూముల్లోనే కాక మామిడి తోటల్లోనూ సాగు చేసుకోవచ్చు. పశువుల మేతగానూ ఉలవ పంట ఉపయోగపడుతుంది. దీన్ని సరైన సమయంలో సాగు చేస్తే మంచి దిగుబడులు పొందవచ్చు.అలాగే అనప పంట సాగు చేయడానికి తేలిక నేలలు, ఇసుకతో కూడిన ఎర్ర నేలలు, మురుగు నీరు నిల్వ ఉండే నేలలు వీటికి అనుకూలం. ఏక పంటగా సాగు చేసినట్లయితే ఎకరాకు 4–5 కిలోలు, అంతర పంటగా సాగుచేస్తే ఎకరాకు 1–2 కిలోల విత్తనం సరిపోతుంది. ప్రస్తుతం మండలంలో అలసందులు 9 ఎకరాల్లో, అనప 25 ఎకరాల్లో, కంది 58 ఎకరాల్లో సాగవుతోంది. అదును పోకముందే మరింతగా సాగు చేస్తే రైతులకు లాభదాయకమని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

సూచనలు పాటించాలి

రైతులు పంట సాగు చేసేటప్పుడు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తే నష్టపోయే అవకాశం ఉండదు. అంతర పంటలను సాగు చేసుకోవడంతో తక్కువ ఖర్చుతో అధిక లాభాలు పొందవచ్చు. దీంతో ఎరువుల ఖర్చు తగ్గించడంతో పాటు కలుపు మొక్కలను కూడా నివారించవచ్చు. రైతులు అంతర పంటల వైపు మొగ్గు చూపితే అధిక ఆదాయం పొందవచ్చు. ఒకే పంటలో మూడు రకాల పంటలను సాగు చేసుకోవచ్చు.

– రాజ్యలక్ష్మి, మండల వ్యవసాయ అధికారిణి, వి.కోట

సస్యరక్షణతో అధిక దిగుబడులు



మాట్లాడుతున్న మధుసూదన్‌రెడ్డి, హాజరైన రైతులు

- జిల్లా ఉద్యానవనశాఖ అధికారి మధుసూదన్‌రెడ్డి

పులిచెర్ల (కల్లూరు): మామిడి పంటలో సస్యరక్షణ చర్యలు చేపడితే అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా ఉద్యానవనశాఖాధికారి మధుసూదన్‌రెడ్డి తెలిపారు. పులిచెర్ల మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మండలంలోని మామిడి రైతులతో అవగాహన సదస్సు నిర్వహించారు. మామిడి పూత దశలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఆయన వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త బాలా హుస్సేన్, వ్యయసాయశాఖాధికారిణి సంతోషి కుమారి, రైతులు పాల్గొన్నారు.

పిల్లలను కార్మికులుగా పెట్టుకోవద్దు


అవగాహన కల్పిస్తున్న అధికారులు

సదుం: పిల్లలను బాలకార్మికులుగా పెట్టుకోవద్దని మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ ప్రతినిధి గట్టప్ప సూచించారు. సదుం, సోమల మండల కేంద్రాల్లో కార్మికశాఖ అధికారులతో కలసి బాలకార్మికుల కోసం తనిఖీలు, పునరావాసం కార్యక్రమం శనివారం నిర్వహించారు. పలు దుకాణాలు, హోటళ్లలో తనిఖీలు చేశారు. బడిఈడు పిల్లలు తప్పనిసరిగా పాఠశాలలకు వెళ్లాలని, వారిని పనుల్లో పెట్టుకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన ఈసందర్భంగా హెచ్చరించారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో దినేష్‌కుమార్, విశ్వనాథ, ఆసియా, చౌడేశ్వరి, శశికళ, సబిత, సుబ్రమణ్యంబాబు పాల్గొన్నారు.

పాఠ్యపుస్తకాల వితరణ


పుస్తకాలను అందజేస్తున్న స్వరూప్

కుప్పంరూరల్: తాను చదువుతున్న కళాశాలకు ఏదైనా చేయాలని తలచాడు ఓ పూర్వ విద్యార్థి. ఆలోచన రావడమే తడువు రూ.లక్ష విలువ చేసే పుస్తకాలను తాను చదువుకున్న కళాశాలకు వితరణగా ఇచ్చి దాతృత్వాన్ని చాటుకున్నాడు. కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 2004–07 మధ్య ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్‌లో చదివిన ఎన్.స్వరూప్ ప్రస్తుతం కాలిఫోర్నియాలో ఉద్యోగం చేస్తున్నాడు. తనకు ఇంతటి స్థాయి కల్పించిన కళాశాలకు ఏదైనా చేయాలనే ఉద్దేశంతో గ్రంథాలయానికి రూ.లక్ష విలువ చేసే పుస్తకాలు వితరణగా ఇచ్చాడు. ఇందులో అకడమిక్ పుస్తకాలు, ఈ–సెట్, గేట్, సివిల్స్ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ప్రిన్సిపల్ డా.జగన్నాథరావుకు అందజేశారు. అధ్యాపకులు సుబ్బన్న, బాపూజీనాయక్, రమేష్, నరసింహులు, లైబ్రేరియన్ సుగుణ పాల్గొన్నారు.

సబ్సిడీతో మత్స్యకారులకు అండ

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం చేప పిల్లల పెంపకానికి సబ్సిడీ ఇవ్వడంపై స్థానిక మత్స్యకారులు హర్షం వ్యక్తం చేశారు. శనివారం వెంకటేశ్వర మత్స్యకార సంఘ అధ్యక్షుడు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో పోస్టర్లు విడుదల చేశారు. చేప పిల్లలకు 60శాతం రాయితీ ఇవ్వడంతో మత్స్యకారులకు భరోసా లభించిందన్నారు. కూటమి నాయకులు గంగరాజు, కామేశ్వరరావు, దొరస్వామి, రఘుబాబు, ప్రకాష్, కుమార్ పాల్గొన్నారు.

షేడ్ నెట్‌తో నాణ్యమైన నారు



- షేడ్‌నెట్ సేద్యంపై రైతుల ఆసక్తి
- దీంతో నాణ్యంగా పంట దిగుబడులు
- రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యానశాఖ


షేడ్‌నెట్‌లో పెరుగుతున్న టమాట, మిరప నారు

పలమనేరు: కూరగాయల సాగు చేసే రైతులకు నారు పెంచుకోవడం తప్పనిసరి అయితే నారును సంప్రదాయ పద్ధతిలో సాగు చేయడం వ్యయప్రయాసలతో కూడుకున్న పని. దీనికి తోడు పంట నాణ్యత, దిగుబడి తగ్గి నష్టాల పాలవుతుంటారు. అదే షేడ్‌నెట్‌తో నారు పెంపకం చేపడితే తక్కువ ఖర్చుతో పాటు నాణ్యమైన నారును ఉత్పత్తి చేసి అధిక దిగుబడులు సాధించవచ్చు. దీంతో పలమనేరు హార్టికల్చర్ డివిజన్‌లోని రైతులు ఇటీవల కాలంలో షేడ్‌నెట్ల నారుని తీసుకొచ్చి నాటి మంచి ఫలితాలను సాధిస్తున్నారు.

షేడ్ నెట్ల ఏర్పాటు

వీటిని ఏర్పాటు చేసుకునే రైతులు ముందుగా పది అడుగుల పొడువుగల రాతి స్తంభాలు లేదా సిమెంట్ పోల్స్‌ను ఎనిమిదడుగుల దూరంలో మూడడుగుల లోతుగా పాతాలి. పైభాగంలో ఇనుప తీగలను పోల్స్‌కు బిగించుకోవాలి. దానిపై షేడ్‌నెట్‌ను అమర్చుకోవాలి. ఇక చుట్టుపక్కల క్రిమి, కీటకాల నుంచి రక్షణగా తెరలను ఏర్పాటు చేసుకోవాలి.

తర్వాత నేలను చదును చేసుకొని మూడు అడుగుల వెడల్పుతో బెడ్లను ఏర్పాటు చేసుకోవాలి. 0.75 అంగుళాల వ్యాసార్థం గల ప్లాస్టిక్ పైపులను అర్ధ చంద్రాకారంలో వంచి బెడ్లపై అమర్చాలి. అధిక వర్షం, మంచు నుంచి నారును కాపాడుకోవచ్చు.

నారు మడి పెంచేందుకు ట్రేలు

నారు మడిని పెంచడానికి ఉపయోగించే ట్రేలను ప్రోటేస్ అంటారు. సాధారణంగా 98 గుంతలున్న ట్రేస్‌లో టమాట, వంకాయ, క్యాబేజీ, మిర్చిలాంటి కూరగాయ నారులను పెంచుకోవచ్చు. ట్రేలను ఉపయోగించిన ప్రతిసారి శుభ్రమైన నీటితో లేదా రసాయనాలతో శుభ్రం చేసుకోవాలి. ట్రే అడుగు భాగంలో రంధ్రాలను ఏర్పాటు చేసుకోవాలి.

నారు మడుల్లో సస్యరక్షణ ఇలా..

నారు మొలకెత్తాక నారు కుళ్లు ఉంటే మూడు గ్రాముల కాపర్ యాక్సీక్లోరైడ్ లేదా రెండు గ్రాములు రిడోమిల్ ద్రావణాన్ని లీటర్ నీటికి చొప్పున పిచికారీ చేయాలి. తెల్లదోమ, తామర పురుగులాంటి రసం పీల్చే పురుగులు ఉన్నట్లయితే ఇమిడో క్లోప్రైడ్ లేదా థియోమిథాక్సైడ్‌లను ఉపయోగించాలి.

నర్సరీలకు కోకోపీట్ ఎరువు(కొబ్బరి వ్యర్థాలతో తయారయ్యేది) ఎంతగానో ఉపయోగం. కొబ్బరి పీచుతో తయారు చేసిన కోకోపీట్‌కు తేమను నియంత్రించే సామర్థ్యంతో పాటు విత్తనం మొలకెత్తేందుకు అనుకూలంగా ఉంటుంది. విత్తనం విత్తిన తర్వాత ట్రేలను ఒకదానిపై ఒకటి పేర్చి పాలథిన్ కవర్‌తో కప్పాలి. తద్వారా విత్తనాలు ఒకేసారి మొలకెత్తుతాయి. మొలకెత్తిన వెంటనే ట్రేలను విడదీసి బెడ్‌పై పరచి క్రమం తప్పకుండా నీటిని అందించాలి.

ప్రయోజనాలు..



- ఈ విధానంతో పెంచిన నారు ఎక్కువగా చనిపోదు.
- విత్తనం వృథా కాకుండా మొలకెత్తుతుంది.
- నారు మడుల మధ్య మొలకల దూరం సమానంగా ఉంటుంది.. కాబట్టి పెరుగుదల సమతుల్యంగా ఉంటుంది
- చీడ, పీడల బెడద తక్కువగా ఉంటుంది.
  –వేరు వ్యవస్థ వృద్ధి చెంది పొలంలో నాటినపుడు సమర్థంగా పెరుగుతుంది.
- నీటిని సులభంగా రవాణా చేసుకొంటుంది
- నారును రవాణ చేసేటపుడు ట్రేల కారణంగా దెబ్బతినదు.
- ఏకకాలంలో పంట పక్వాని కొచ్చి కోత ఖర్చుల బాధ తగ్గుతుంది.
- నారు పెంపకంలో మొక్కలకు సరిపడా సూర్యరశ్మి తేమ, సమపాలల్లో షేడ్‌నెట్లలో అందుతుంది.
- నారు సాగుకు కోకో పీట్ ఉత్తమం..

– మధుసూదన్‌రెడ్డి, జిల్లా ఉద్యానశాఖ అధికారి, చిత్తూరు

తెరుచుకోని రేషన్ షాప్


మూతపడ్డ రేషన్ షాపు

గంగవరం: మండలంలోని కొత్తపల్లిలో ఉన్న చౌక దుకాణం రెండు రోజులుగా తెరవకపోవడంతో బియ్యం అందక అక్కడి లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. గత ఒకటో తేదీ నుంచి షాపులో రేషన్ బియ్యం వేయాల్సి ఉండగా శనివారం 2వ తేదీ అయినా షాపులో రేషన్ పంపిణీ జరగలేదు. దీంతో అక్కడి రేషన్ దుకాణం పరిధిలోని కార్డుదారులకు సమయానికి రేషన్ అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొత్తపల్లికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న కేసీపెంట, 4 కిలోమీటర్ల దూరంలోని మంజునాథకాలనీ, కిలోమీటరు దూరంలో ఉన్న పాతకీలపట్ల గ్రామాల ప్రజలందరూ ఇక్కడి రేషన్ దుకాణంలోనే బియ్యం తీసుకోవాలి. అయితే ఇంటింటికీ బియ్యం పంపిణీ పథకం రద్దు వల్ల ఇటు షాపు వద్ద బియ్యం ఇవ్వక, అటు ఊళ్లలోకి రేషన్ వాహనం సైతం వెళ్లకపోవడంతో లబ్ధిదారులకు ఇబ్బంది తప్పలేదు. ఈ కూటమి ప్రభుత్వానికి పేద ప్రజలపై కాసంతైనా కనికరం ఉండుంటే ప్రజలకు ఇలాంటి అవస్థలు ఉండవు. రెండు రోజులైనా రేషన్ ఎందుకు ఇవ్వలేదో డీలర్‌ను ప్రశ్నించాల్సిన సివిల్ సప్లైస్ అధికారులు నిమ్మకుండి పోవడంలో ఆంతర్యం ఏమిటో..

లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి


పోలీస్ అధికారులతో సమావేశమైన జడ్జి లిఖిత

–జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

పలమనేరు: పట్టణ సమీపంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుల్లో డిసెంబర్ 14న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని పలమనేరు జూనియర్ సివిల్ జడ్జి లిఖిత సూచించారు. స్థానిక కోర్టులో శనివారం కోర్టు పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు, న్యాయవాదులతో ఇందుకు సంబంధించిన సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ రాజీ మార్గమే రాజమార్గం కాబట్టి కక్షిదారులు అనవసరమైన పంతాలకు పోకుండా కేసులను రాజీ చేసుకుని శాంతిపూర్వకంగా ఉండేలా జీవించాలన్నారు. ఇందులో ప్రి లిటిగేషన్ కేసులను కూడా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. చెక్‌బౌన్స్, జీవనాధారం, వేధింపులు, గృహహింస, సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకునేందుకు ఇది మంచి అవకాశమన్నారు. కక్షిదారులు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోలీసులు పెండింగ్ కేసుల రాజీకి కృషి చేయాలని సూచించారు.

ఆ నలుగురు కనుసన్నల్లోనే పాలన!

- కుప్పం మున్సిపాలిటీలో ఏకపక్ష ధోరణి
- అధికార పక్షం కౌన్సిలర్లకే పెద్దపీట


మున్సిపల్ కార్యాలయం

కుప్పం: కుప్పం మున్సిపాలిటీలో పాలన వ్యవస్థ ఏకపక్ష ధోరణితో అధికార పార్టీకి చెందిన ఆ నలుగురు కౌన్సిలర్ల కనుసన్నల్లోనే సాగుతోంది. మున్సిపాలిటీలో 25 కౌన్సిలర్లు ఉన్నా అధికార పార్టీకి చెందిన నలుగురు కౌన్సిల్ సభ్యులు చెప్పిందే వేదం. మున్సిపాలిటీలో పనిచేస్తున్న సిబ్బంది సైతం ఏకపక్షంగా వ్యవహరిస్తూ పాలనను అడ్డదారి పట్టిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులు 16 మంది ఉన్నా వారిలో 8 మంది అధికార పార్టీలోకి వెళ్లారు, మిగిలిన 8 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిల్ సభ్యులకు అధికారులు కనీస గౌరవం ఇవ్వకపోవడం దారుణం రాజ్యాంగ బద్ధంగా జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలిచిన సభ్యులకు కనీస గౌరవం ఇవ్వకుండా మున్సిపల్ అధికారులు వ్యవహరిస్తున్నారని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇష్టారాజ్యంగా ఆ నలుగురు..

అధికార పార్టీకి చెందిన నలుగురు కౌన్సిలర్లు కనుసన్నల్లో మున్సిపాలిటీ పాలన సాగుతోంది. ప్యాలెస్ ఎక్స్‌టెన్సన్, మురుగునీటి కాలువ తవ్వకాలను కొందరు కౌన్సిల్ సభ్యులు వ్యతిరేకించారు. కానీ అధికార పార్టీ సభ్యుల వ్యక్తిగత విషయంగా కాలువను తవ్వి ప్రజలను ఇబ్బంది పెట్టారు. అదేవిధంగా బస్టాండ్ ప్రాంగణంలో రాత్రి 9 గంటలపైన దుకాణాలు మూసివేయాలని అధికారులతో ప్రకటించారు. ఈ విషయంగా కొత్తపేట టీడీపీలో క్రియాశీలకంగా ఉన్న నాయకుడి బంధువు పోలీసులు ప్రతాపం చూపించారు. దీంతో 15 రోజుల కిత్రం అధికారులకు, వ్యాపారస్తుల మధ్య తీవ్రస్థాయిలో వాదోపవాదనలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం బాణసంచా దుకాణాదారులపై మున్సిపల్ అధికారులు నుంచి టీడీపీ కౌన్సిల్ సభ్యులు ఒత్తిడి తీసుకొచ్చారు. పదేళ్లుగా పట్టణానికి దూరంగా బాణసంచా దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది వాటికి మున్సిపాలిటీలో అభ్యంతరాలు వచ్చాయి. తీరా అధికారులను ప్రశ్నిస్తే మాకు సంబంధం లేదు ఆ కౌన్సిల్ సభ్యుల పేర్లు చెప్పి బాణసంచా దుకాణదారులను వేధిస్తున్నారు.

అధికారుల ఏకపక్ష వైఖరి

మున్సిపాలిటీలో పనిచేస్తున్న అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు. నెల రోజుల పాటు వార్డుబాట పేరిట ప్రజలను నుంచి ఫిర్యాదు స్వీకరించారు. మున్సిపాలిటీలో 25 వార్డుల్లోనూ ఫిర్యాదులు స్వీకరించినా పరిష్కారాలు శూన్యం. ప్రతి వార్డుబాట లోనూ స్థానికంగా ఉన్న కౌన్సిలర్‌కు సమాచారం ఇవ్వకుండా కార్యక్రమాలు చేశారు. అధికార పార్టీ కౌన్సిలర్లతోనే 25 వార్డుల్లో వార్డుబాట పూర్తి చేశారు. స్థానికంగా ఉన్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లకు చిన్నపాటి సమాచారం ఇవ్వకుండా ఏకపక్ష వైఖరితో పాలన సాగిస్తున్నారని పట్టణంలో ఆరోపణలు వస్తున్నాయి.

అధికారులు సమయ పాలన పాటించాలి


సిబ్బందితో మాట్లాడుతున్న జెడ్పీసీఈఓ రవికుమార్‌నాయుడు

బంగారుపాళెం: విధి నిర్వహణలో అధికారులు సమయపాలన పాటించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యదర్శి రవికుమార్ నాయుడు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డుల ఆవరణను పరిశీలించారు. కార్యాలయంలో ఎంత మంది సిబ్బంది పనిచేస్తున్నారనే వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పింఛన్ల పంపిణీపై ఇన్‌చార్జి ఎంపీడీఓ శ్రీధర్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లేడుపల్లె గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ సిబ్బందితో మాట్లాడారు. సచివాలయ పరిధిలో సమస్యలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సిబ్బంది సమయ పాలన పాటించి సకాలంలో విధులకు హాజరుకావాలని సూచించారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.

చిన్నతనం నుంచే సామాజిక సేవ అలవరుచుకోవాలి


విద్యార్థినికి బహుమతి అందజేస్తున్న రాములు

చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులు చిన్నతనం నుంచే సామాజిక సేవను అలవరుచుకోవాలని పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా డిప్యూటీ జనరల్ మేనేజర్ రాములు అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో శనివారం కొంగారెడ్డిపల్లెలోని నగరపాలక ఉన్నత పాఠశాలలో విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అవినీతి రహిత దేశం కోసం కృషిచేయాలన్నారు. చిన్నతనం నుంచే సేవా గుణం అలవాటు చేసుకోవాలని చెప్పారు. నిజాయితీగా ఉంటూ దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని తెలిపారు. అనంతరం విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం గీతాంజలి, అసిస్టెంట్ మేనేజర్ బరక్‌తుల్లా, జూనియర్ ఇంజినీర్ రవితేజ, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్‌లో ఐరాల విద్యార్థులకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులతో హెచ్‌ఎం, పీడీ

ఐరాల: రాష్ట్ర స్థాయి అండర్–14 ఫెన్సింగ్ పోటీల్లో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం కోమల తెలిపారు. ఆమె శనివారం మాట్లాడుతూ ఇటీవల నంద్యాల డీఎస్‌ఏ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–14 బాలికల జట్టు ఈవెంట్ సాబర్ విభాగంలో తమ విద్యార్థిని గాయత్రి రజత పతకం, బాలుర ఈపీఈఈ విభాగంలో పవన్‌కుమార్ కాంస్య పతకాలు సాధించారని పేర్కొన్నారు. క్రీడాకారులను, పీడీ దేవాను ఖేలో ఇండియా ఫెన్సింగ్ కోచ్ రాఘవ కార్తీక్, ఎస్‌ఎంసీ చైర్మన్ మహబూబ్‌బాషా, ఉపాధ్యాయులు అభినందించారు.